సాక్షి కుమురం భీం

మంగళవారం । 14 । నవంబర్ । 2023



రెండు సభల్లో వారి 'వాణి'

కొంతమంది నాయకులు అసెంబ్లీ, పార్లమెంట్ రెండు సభల్లో అడుగు పెట్టారు. చట్టసభల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు చాటుకున్నారు. 10లో▸



వేధిస్తున్న కూలీల కొరత

పత్తితీతకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు సరిహద్దు లోని మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం 32.4 /19.2

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'స్థలం కబ్జా చేస్తే ఊరుకోం'



ప్రహరీని తొలగిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: వీవోఏల సంఘం భవనం కోసం కేటాయించిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేస్తే ఊరుకోమని వీవోఏల సంఘం సభ్యులు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తారకరాంనగర్‌లో వీవోఏల సంఘానికి కేటాయించిన స్థలాన్ని హసన్ అనే వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. స్థలానికి చుట్టూ వేసిన ప్రహరీని సోమవారం పలువురు సభ్యులు తొలగించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వీవోఏల సంఘం సభ్యులు అర్చన, సునీత, ఫాతిమా, శ్రీలత, రమ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుగ్లోత్ రవినాయక్ రాజీనామా



మాట్లాడుతున్న రవినాయక్


ఆసిఫాబాద్: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు రెబ్బెన మండలం గోలేటికి చెందిన సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ గుగ్లోత్ రవినాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఒడ్డెర, నాయీబ్రాహ్మణ సంఘంతోపాటు పలు సంఘాల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 15 ఏళ్లుగా తెలంగాణ ఉద్యమంతోపాటు బీఆర్‌ఎస్‌లో చురుకుగా పనిచేస్తున్నా పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు తమను ఆహ్వానించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. త్వరలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నాయకుల వైఖరిని నిరసిస్తూ అవసరమైతే నోటాకు ఓటు వేస్తామని పేర్కొన్నారు.

గొబ్బెమ్మలతో దీపావళి



దీపాలతో యువతులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని బంజారా(లంబాడా) తెగకు చెందిన పెళ్లి కాని యువతులు దీపావళి పండుగను విభిన్నంగా జరుపుకొన్నారు. ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించడంతోపాటు దీపాలతో గ్రామాల్లోని ఇంటింటికీ తిరిగారు. సోమవారం చేలకు వెళ్లి గునుగు, బంతి, మల్లెమందారం పూలను తెచ్చి ఆవుపేడతో గొబ్బెమ్మలు తయారు చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



గునుగు పూలు తెంపుతున్న యువతులు

ఇంటింటా దీపాల వెలుగులు



జిల్లాలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు దీపాలు, విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోయాయి. ధనలక్ష్మి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నాపెద్ద తేడా లేకుండా టపాసులు పేల్చుతూ ఆనందంగా గడిపారు.

- వివరాలు 11లో▸

పరిశీలన పూర్తి

- వివిధ కారణాలతో ఎనిమిది నామినేషన్లు తిరస్కరణ
- 15 వరకు ఉపసంహరణకు గడువు

సాక్షి, ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టం ముగిసింది. శాసనసభ ఎన్నికల్లో పోటీకి ప్రధాన పార్టీలతోపాటు వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు దాఖలు చేసిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు) సోమవారం పరిశీలించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో దాఖలైన నామినేషన్లను స్క్రూటినీ పూర్తిచేసి ఆమోద ముద్ర వేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 64 నామినేషన్లు దాఖలుగా కాగా ఎనిమిది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యారు.



సిర్పూర్(టి)లో నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి

వివిధ కారణాలతో తిరస్కరణ

ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 3న ప్రారంభమై 10వ తేదీతో ముగిసింది. సిర్పూర్ నియోజకవర్గం నుంచి 31 సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా.. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 33 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలనలో భాగంగా నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. సిర్పూర్‌లో ఐదు నామినేషన్లు, ఆసిఫాబాద్‌లో మూడు నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్లతోపాటు బీ ఫారాలు సమర్పించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు కోవ లక్ష్మి, అజ్మీరా శ్యాం నాయక్, అజ్మీరా ఆత్మారాంనాయక్, కనక ప్రభాకర్, కోనేరు కోనప్ప, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, రావి శ్రీనివాస్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆయా పార్టీల నుంచి అధికారిక అభ్యర్థులుగా గుర్తించారు. బీఫారాలు సమర్పించకపోవడం, నిబంధనల ప్రకారం వివరాలు నమోదు చేయని అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

సిర్పూర్‌లో ఐదు తిరస్కరణ

సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం ఐదు నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన కోనేరు కృష్ణారావు బీఫారం సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరించారు. అలాగే అలైన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రీ ఫార్మ్స్ పార్టీ అభ్యర్థి వెంకటేష్ దాసరి, ఆబాద్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన నందిపేట్ విలాస్, స్వతంత్రులు కాసనగొట్టు సంతోష్, తబ్బని ముక్తేష్‌ల నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గం వివరాలు

ఆమోదం పొందిన నామినేషన్లు

అభ్యర్థి	పార్టీ
కోవ లక్ష్మి	బీఆర్‌ఎస్
అజ్మీరా శ్యాంనాయక్	కాంగ్రెస్
అజ్మీరా ఆత్మారాం	బీజేపీ
కనక ప్రభాకర్	బీఎస్పీ
అజ్మీరా రాంనాయక్	ప్రజా శాంతి పార్టీ
ఆత్రం గోవర్ధన్	గోండ్వానా గణతంత్ర పార్టీ
గోవింద్ బుక్యా	జనతా కాంగ్రెస్
ఎస్.తిరుపతి	విద్యార్థుల రాజకీయ పార్టీ
బుక్యా పల్లవి	బహుజన ముక్తి పార్టీ
ఆడె బాలజీ	స్వతంత్ర
కోట్నాక కృష్ణారావు	స్వతంత్ర
కోట్నాక విజయ్‌కుమార్	స్వతంత్ర
పూసం సోనేరావు	స్వతంత్ర
మెస్రాం నవీన్‌కుమార్	స్వతంత్ర
రెబ్బెన నాగరాజు	స్వతంత్ర
వసంత్ సింగ్ జాదవ్	స్వతంత్ర
సిడాం అన్నిగా	స్వతంత్ర
సిడాం దాము	స్వతంత్ర

తిరస్కరణ

అభ్యర్థి	పార్టీ
అజ్మీరా సంధ్య	బీజేపీ
కోట్నాక విజయ్‌కుమార్	అదాబ్ పార్టీ
మడావి ఆనందేశ్వర్	స్వతంత్ర

సిర్పూర్‌లో ఆమోదం పొందిన నామినేషన్లు

అభ్యర్థి	పార్టీ
కోనేరు కోనప్ప	బీఆర్‌ఎస్
రావి శ్రీనివాస్	కాంగ్రెస్
పాల్వాయి హరీశ్‌బాబు	బీజేపీ
ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్	బీఎస్పీ
కామెర నగేష్	ఇండియన్ ప్రజా బంధు పార్టీ
కోబ్రగడే గంతీదాస్	న్యూ ఇండియా పార్టీ
జె.దీపక్‌కుమార్	రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా
ఆర్.అజయ్‌కుమార్	ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ
జాడి శ్యాంరావు	భారతా ప్రజాకీయ పార్టీ
లలిత్ భల్‌హోత్రా	యుగ తులసీ పార్టీ
దోంగ్రి ప్రవీణ్‌కుమార్	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ
పర్చాకి కేశవ్‌రావు	గోండ్వాన గణతంత్ర పార్టీ
సోదారి నిరంజన్	సోషలిస్ట్ పార్టీ
దాసరి వెంకటేశ్	స్వతంత్ర
దుర్గం శ్యాంరావు	స్వతంత్ర
దేశగణి సాంబశివగౌడ్	స్వతంత్ర
ఎల్ములే మనోహర్	స్వతంత్ర

15 వరకు ఉపసంహరణ

నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15 వరకు అవకాశముంది. నామినేషన్లను దాఖలు చేసిన అభ్యర్థులకు ఎవరికైనా బరిలో నిలిచే ఉద్దేశం లేకపోతే వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. రెబల్స్‌గా నామినేషన్ల దాఖలు చేసిన అభ్యర్థులతో వివిధ పార్టీలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ఈ రెండు రోజులపాటు బుజ్జగింపుల పర్వం కొనసాగే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఎంతమంది పోటీ నుంచి తప్పుకుంటారో తేలనుంది. ఈ ప్రక్రియ కూడా పూర్తయితే ఏ నియోజకవర్గం నుంచి ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉంటారన్న విషయంపై స్పష్టత రానుంది. ఆ తర్వాత అధికారులు తుది జాబితా ప్రకటిస్తారు. బరిలో నిలిచే స్వతంత్రులకు గుర్తులు కేటాయించనున్నారు.

చుట్టేస్తారా..

- ప్రచారానికి మిగిలింది 14 రోజులే
- ఉమ్మడి జిల్లాలో పూర్తికాని ముఖ్యనేతల పర్యటన
- బీఆర్‌ఎస్ అన్ని నియోజకవర్గాలు టచ్ చేసేలా ప్లాన్
- కాంగ్రెస్, బీజేపీలది కొంత మందకొడిగా..
- 26న నిర్మల్‌కు మోదీ.. త్వరలో మందమర్రికి రాహుల్‌గాంధీ
- ఆదిలాబాద్‌లో ఇప్పటికే పర్యటించిన అమిత్‌షా.. త్వరలో 'యోగి' రాక..



సీఎం కేసీఆర్



ప్రధాని మోదీ



రాహుల్ గాంధీ

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణతో పాటు పరిశీలన ప్రక్రియ కూడా ముగిసింది. ప్రస్తుతం ప్రచార పర్వం మంచి ఊపులో ఉంది. ఈ నెల 30న ఎన్నికలు నిర్వహించనుండగా, అంతకుముందు 48 గంటలు ముందుగా అంటే.. 27వ తేది రాత్రితో ప్రచారం పరిసమాప్తం అవుతుంది. ఈక్రమంలో వాడవాడన ప్రస్తుతం ప్రచార రథాలు సందడి చేస్తున్నాయి. కార్యకర్తలు పార్టీల మేనిఫెస్టోను జనాల్లోకి తీసుకెళ్తున్నారు. ఇకపోతే జాతీయ, రాష్ట్ర నేతలు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఇంకా పలు చోట్ల పర్యటించాల్సి ఉంది. మిగిలింది మాత్రం 14 రోజులే.

కేసీఆర్ పూర్తిస్థాయిలో..

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావులు ప్రజా ఆశీర్వాద సభల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో సభలను పూర్తి చేశారు. మరో నాలుగు సభల్లో పర్యటించేలా ప్రణాళిక ఖరారైంది. కాంగ్రెస్ విజయభేరి సభల్లో భాగంగా రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో సభలు పూర్తి చేశారు. త్వరలో మరో రెండు చోట్ల షెడ్యూల్ ఖరారైంది. బీజేపీ జనగర్జన సభల్లో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బండి సంజయ్ విచ్చేశారు. బీజేపీకి సంబంధించి మూడు నియోజకవర్గాల్లోనే ముఖ్యనేతల పర్యటన సాగింది.

మోదీ, రాహుల్ రాక..

బీజేపీకి సంబంధించి ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ జరగగా, ఈ నెల 26న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్మల్‌లో పర్యటిస్తున్నారు. ఇక ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్వరలో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రచారానికి సంబంధించి ఉమ్మడి జిల్లాకు రాహుల్ గాంధీ రానున్నట్లు హస్తం నేతలు చెబుతున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రిలో త్వరలో సభ నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

కేసీఆర్ పర్యటించిన నియోజకవర్గాలు..: చెన్నూర్, బెల్లంపల్లి, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్
షెడ్యూల్ ఖరారైనవి: 16న ఆదిలాబాద్, బోథ్, 24న మంచిర్యాల, 26న ఖానాపూర్ రాక
కేటీఆర్ పర్యటించినవి: చెన్నూర్
షెడ్యూల్ ఖరారైనవి: 17న ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం, 27న ఖానాపూర్‌లో రోడ్‌షో.
హరీశ్‌రావు పర్యటించినవి: చెన్నూర్, ఖానాపూర్, ఆదిలాబాద్
కిషన్ రెడ్డి, ఈటల పర్యటించినవి: ఆదిలాబాద్
బండి సంజయ్ పర్యటించినవి: ఆదిలాబాద్, ఖానాపూర్, సిర్పూర్
రేవంత్‌రెడ్డి పర్యటించినవి: బెల్లంపల్లి, ఖానాపూర్, ఆదిలాబాద్
షెడ్యూల్ ఖరారైనవి: 15న నిర్మల్, బోథ్‌కు రాక, త్వరలో చెన్నూర్‌కు వచ్చే అవకాశం.

ఆ రెండు నియోజకవర్గాలను టచ్ చేయలేదు..

ముఖ్య నేతల పర్యటనలకు సంబంధించి ఇప్పటివరకు పలు నియోజకవర్గాల్లో ఏదైనా పార్టీ నుంచి బహిరంగ సభలు నిర్వహించినప్పటికీ మంచిర్యాల, బోథ్ నియోజకవర్గాల్లో ఇటు జాతీయ, అటు రాష్ట్ర నేతలెవరు ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన తర్వాత రాకపోవడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లో త్వరలో సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. ఈ నెల 17 నుంచి కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా రాష్ట్రానికి రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వారం రోజులు పర్యటిస్తున్నారు. ఆ రోజుల్లోనే ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మోదీ నిర్మల్ సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ చేసేలా నేతలు ప్రణాళిక చేస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అసంపూర్తేనా..

బీఆర్‌ఎస్ టచ్ చేయని నియోజకవర్గాలు మంచిర్యాల, బోథ్ ఉండగా, కాంగ్రెస్ టచ్ చేయనివి చెన్నూర్, మంచిర్యాల, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, సిర్పూర్, బోథ్‌లు ఉన్నాయి. బీజేపీ టచ్ చేయని నియోజకవర్గాలు చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, భైంసా, బోథ్ ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రణాళిక ప్రకారం మిగతా నియోజకవర్గాలను చుట్టేయనుంది. అయితే ఈ మిగిలిన రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ అన్ని నియోజకవర్గాల్లో పర్యటనకు సంబంధించి ఇప్పటివరకు ప్లాన్ కనిపించడం లేదు. దీంతో ఈ రెండు పార్టీల ముఖ్య నేతల పర్యటన అసంపూర్తిగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కొత్త ఓటర్లు 5,904 మంది

- చివరి అవకాశాన్ని వినియోగించుకున్న అర్హులు
- జిల్లాలో 4,53,538కు చేరిన ఓటర్ల సంఖ్య

ఆసిఫాబాద్: జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొన్ని నెలలుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆధ్వర్యంలో పలుమార్లు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని బీఎల్‌వోలతోపాటు స్థానిక అధికారులు అవగాహన కల్పించారు. అలాగే కళాశాలల్లో విద్యార్థులకు ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. నేరుగా దరఖాస్తు ఓటరు నమోదు చేయడంతోపాటు సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 31 వరకు ఓటరు నమోదుకు చివరి అవకాశం కల్పించారు. జిల్లాలో కొత్తగా 5,904 మంది కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నారు.

మొత్తం 4,53,538 మంది..

అక్టోబర్ 4న రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ జాబితా ప్రకారం జిల్లాలో 4,47,634 మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం అర్హులైన వారికి అక్టోబర్ 31 వరకు ఓటరు నమోదుకు చివరి అవకాశం కల్పించింది. నెల రోజుల్లో 5,904 మంది కొత్త ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. తాజాగా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య 4,53,538కి చేరింది. ఇందులో పురుషులు 2,26,844 మంది, మహిళలు 2,26,666 మంది, ఇతరులు 28 మంది ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలో 3,48,710 మంది ఓటర్లు ఉన్నారు. ఐదేళ్లలో గణనీయంగా కొత్త ఓటర్లు పెరిగారు. మొత్తం 1,04,828 మంది ఓటర్లుగా నమోదయ్యారు.



వయస్సుల వారీగా ఓటర్లు

వయస్సు	సిర్పూర్	ఆసిఫాబాద్	మొత్తం
18- 19	8,318	9,626	17,944
20- 29	47,205	57,957	10,5162
30- 39	57,550	64,140	12,1690
40- 49	45,321	40,479	85,800
50-59	34,061	28,198	62,259
60- 69	20897	16,401	3,7298
70- 79	10,083	7,472	17,554
80పైన	3,489	2,392	5,831

తాజా ఓటరు జాబితా వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	304	1,12,899	1,13,748	17	2,26,664
సిర్పూర్	293	1,13,945	1,12,918	11	2,26,874

'నకిలీ' హల్‌చల్!

- కౌటాలలో రూ.500 దొంగనోట్లు వెలుగులోకి..
- మహారాష్ట్రలో పత్తి కొనుగోళ్ల ప్రారంభంతో విచ్చలవిడిగా చలామణి
- నష్టపోతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు

కౌటాల మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఎదుట ఉన్న పెట్రోల్ బంక్‌లో ఈ నెల 3న రూ.500 నకిలీ నోటు వెలుగులోకి వచ్చింది. అలాగే తలోడి చౌరస్తాలోని మరో బంక్‌లో ఈ నెల 4న సిబ్బందికి రూ.500 నకిలీ నోటు కనిపించింది. ప్రతిరోజూ రూ.50, రూ.100ల నకిలీ నోట్లు వస్తున్నాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.





కౌటాల పెట్రోల్ బంక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన నకిలీ నోటు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో నకిలీ నోట్ల చలామణి మళ్లీ మొదలైంది. నోటును నిశితంగా పరిశీలిస్తే ఏది నకిలీ.. ఏది అసలు అనేది తెల్సుకోలేని పరిస్థితి. అక్రమార్కులు నోట్లకట్టల్లో వీటిని జొప్పించి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ నోట్లతో సామాన్యులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. కష్టపడి సంపాదించిన డబ్బుల్లో చెల్లని నోట్లు ఉన్నాయని తెలిస్తే ఆందోళన తప్పదు. పదేళ్ల కిందట నకిలీ నోట్లతో లావాదేవీలు ఎక్కువగా జరిగేవి. అప్పట్లో వాంకిడి మండలంలో రూ.లక్షల్లో నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. నోట్ల రద్దు అనంతరం కొన్నేళ్ల పాటు తగ్గినా ఇప్పుడు మళ్లీ జోరందుకుంది.

కౌటాలలో వెలుగులోకి..

కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్‌లో కొత్త నోట్లను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. రూ.2000 నోటును సైతం ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించడంతో ప్రస్తుతం అవి కూడా కనిపించడం లేవు. దీంతో అక్రమార్కులు రూ.500 నోట్లపై దృష్టి సారించారు. పెట్రోల్ బంకులు, కిరాణా షాపులు, బట్టల దుకాణాలు, మెడికల్ షాపులు ఇలా ప్రతిచోట్లా నోట్లు చలామణి చేస్తున్నారు. తాజాగా కౌటాలలోని పెట్రోల్ బంకుల్లో రూ.500, రూ.50, రూ.100 నకిలీ నోట్లను నిర్వాహకులు గుర్తించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కౌటాల మండలంలో ఎక్కువగా రూ.500ల నకిలీ నోట్ల చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది.

రైతులకు నష్టం

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పత్తి పంట చేతికొస్తోంది. కొనుగోలు కేంద్రాలు మాత్రం ఇప్పటివరకు ప్రారంభించలేదు. మరోవైపు సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో పత్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ప్రత్యేక వాహనాలతో రైతుల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. మరికొంత మంది రైతులు అధిక ధర వస్తుందనే కారణంగా పత్తిని మహారాష్ట్రలోని జిల్లాలకు తీసుకెళ్తున్నారు. ఇలాంటి సమయంలోనే రైతులు మోసపోయే అవకాశం ఉంది. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ వ్యాపారులు, దళారులు నకిలీ నోట్లు అంటగడుతున్నారు. ముఖ్యంగా కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్ మండలాలకు చెందిన రైతులను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఏటా పత్తి, వరి, సోయా, కంది పంటలు విక్రయించే సమయంలోనే ఈ నకిలీ నోట్ల వ్యవహారం వెలుగులోకి వస్తోంది. ఇందులో బాధితులు ఎక్కువ మంది రైతులు, చిరు వ్యాపారులే ఉంటున్నారు. మోసపోయిన వారు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం జంకుతున్నారు. మరోవైపు శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సరైన పత్రాలు చూపించకుండా రూ.50వేల నగదు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి కొనుగోళ్ల కోసం వ్యాపారులు వస్తుండగా, రైతులు సైతం తమ పంటను నేరుగా తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటున్నారు. దీంతో నకిలీ నోట్లు ఎలా సరఫరా అవుతున్నాయన్నది గుర్తించడం కష్టంగా మారింది. సామాన్యులకు నకిలీ నోట్లపై అవగాహన లేకపోవడంతో గుర్తించలేకపోతున్నారు.

చలామణిని అరికట్టాలి



కౌటాలలోని బంక్‌లో ఇటీవల రూ.500 నకిలీ నోట్లు వచ్చాయి. ఇవి ఎక్కడ నుంచి వస్తున్నాయో అర్థం కావడం లేదు. నకిలీ నోట్ల చలామణిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఇటీవల నకిలీ నోట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– సత్తయ్య, పెట్రోల్ బంక్ ఉద్యోగి, కౌటాల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కౌటాలలో నకిలీనోట్ల చలామణి విషయం మా దృష్టికి రాలేదు. దొంగ నోట్ల చలామణిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కరెన్సీ నోట్లతో అక్రమ దందా చేస్తే కేసు నమోదు చేస్తాం. ప్రత్యేక నిఘా వేసి చలామణిని కట్టడి చేస్తాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. దొంగనోట్లు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలి.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం


విజయ్(ఫైల్)

కౌటాల(సిర్పూర్): జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన టాకిరే విజయ్ (45) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం ఇంటివద్ద గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుని కుమారుడు అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. సదరు యువతి కొంతకాలంగా కంటినొప్పితో బాధపడుతోంది. ఇటీవల బాధ తీవ్రం కావడంతో రెండు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మంచిర్యాలకు వెళ్లింది. ఇప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన చిక్కాల కృష్ణ (38)పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. సోమవారం స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య హారిక, కూతురు అక్షర ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కనకాపూర్ గ్రామానికి చెందిన కరిపె రాహోజి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఓరుసు వెంకటేశ్వర్లు అజాగ్రత్తగా కారు నడుపుతూ వేగంగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వస్తుండగా బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన రాహోజిని స్థానికులు నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాహోజి భార్య సాయవ్వ ఫిర్యాదుతో వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రెండు సభల్లో వారి 'వాణి'







జంగ్ తెలంగాణ

- ఎంపీ, ఎమ్మెల్యేలుగా రాణించిన పలువురు నేతలు
- రాజకీయంగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాయకుల్లో చాలామంది ఎమ్మెల్యేగానో, ఎంపీగానో ఎన్నికవ్వాలని కలలుకంటారు. వాటిని నిజం చేసుకునేందుకు ఎంతో శ్రమిస్తారు. అనుకున్న లక్ష్యాన్ని చేరాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీల్లో చేరి నియోజకవర్గ టికెట్లను దక్కించుకున్నా ప్రజల్లో పలుకుబడిని సంపాదించుకున్నా చట్టసభల్లోకి అడుగిడే అదృష్టం మాత్రం అందరికీ దక్కదు. అలాంటిది కొంతమంది నాయకులు జిల్లాస్థాయి పదవులను చేపట్టడమే కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ వంటి చట్టసభల్లో అడుగిడి తమకంటూ ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి 13 మంది ఎంపీలుగా ఎన్నికకాగా అందులో 8 మంది ఎమ్మెల్యేలుగా రాణించడం గమనార్హం. పార్లమెంట్, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పార్టీల పరంగా తమవాణి వినిపిస్తున్న కొంతమంది నాయకులు మరోసారి ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన నాయకుల తీరును పరిశీలిస్తే....

– కైలాస్‌నగర్

సి.మాధవరెడ్డి



కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మాధవరెడ్డి టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పదవులను దక్కించుకున్నారు. ఆయన రాజకీయ జీవితం మూడు పార్టీల్లో సాగింది. 1952లో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి 1962లో బోథ్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి రెండో సారి ఎంపీగా విజయం సాధించారు.

పి.నర్సారెడ్డి



స్వాతంత్ర్య సమరయోధుడిగా హైదరాబాద్ నిజాం పాలన నుంచి విముక్తి కోసం ఉద్యమించిన పి.నర్సారెడ్డి ఎంపీగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా సేవలందించి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్మల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇరిగేషన్, రెవెన్యూ, శాసనసభ వ్యవహారాల శాఖ క్యాబినేట్ మంత్రిగా సేవలందించారు. ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 1989లో అదే పార్టీ తరఫున పార్లమెంట్‌లోకి అడుగు పెట్టారు.

పి.గంగారెడ్డి



నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొద్దుటూరి గంగారెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా 1964నుంచి 1967వరకు పనిచేశారు. 1967, 1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి రెండుసార్లు విజయం సాధించారు. ఆ తర్వాత 1978లో నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఎస్.వేణుగోపాలాచారి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగిన నాయకుడు సముద్రాల వేణుగోపాలాచారి. టీడీపీ ఆవిర్భావంతో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1996, 1998, 1999 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్‌తో రికార్డు సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగానూ సేవలందించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన రాష్ట్ర క్యాడ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

రాథోడ్ రమేశ్



ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన తొలి గిరిజన నాయకుడు రాథోడ్ రమేశ్. 1999లో టీడీపీ తరఫున ఖానాపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అదే పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నార్నూర్ జెడ్పీటీసీగా ఎన్నికై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. 2009లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడ్ కావడంతో ఎంపీగా పోటీచేసి పార్లమెంట్‌లోనూ అడుగుపెట్టారు.

సోయం బాపూరావు



వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన సోయం బాపూరావు 2003లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2004లో బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2018లో అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. మరుసటి ఏడాది బీజేపీలో చేరిన ఆయన 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. బీజేపీ నుంచి గెలిచిన తొలి ఎంపీగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం బోథ్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.

గోడం నగేశ్



తన తండ్రి గోడం రామారావు స్ఫూర్తితో ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన గోడం నగేశ్ 1994లో టీడీపీ నుంచి పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999, 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన గిరిజన సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా, గిరిజన సహకార సంస్థ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గానూ పనిచేశారు. 2014 పార్లమెంట్ ఎన్నికల సమయంలో టీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఆ పార్టీ ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు.

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



1991లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలో మరోసారి అదేపార్టీ తరఫున ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరి దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది మరోసారి అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా మరోసారి అసెంబ్లీ బరిలో నిలిచిన ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అత్తారింటికి వెళ్తూ.. అనంతలోకాలకు

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి
- సుర్జాపూర్, బెజ్జూర్‌లో విషాదం

భీమిని/తాండూర్: దీపావళి వేడుకల్లో పాల్గొనేందుకు అత్తారింటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూర్ మండలం రేపల్లెవాడ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. తాండూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన గందె రమేశ్, శైలజ దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. కుమారుడు గందె సాయికృష్ణ (25)కు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్‌కేడ్‌కు చెందిన యువతితో గతేడాది డిసెంబర్ 14న వివాహం జరిగింది. దీపావళికి అత్తారింటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రేపల్లెవాడ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. లారీ డ్రైవర్ అతివేగంతో, అజాగ్రత్తగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని మృతుని తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.


సాయికృష్ణ (ఫైల్)

బెజ్జూర్‌లో ఒకరు..

బెజ్జూర్(సిర్పూర్): అత్తారింటికి వెళ్తుండగా ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కావుడే మధునయ్య (48) దీపావళి వేడుకల్లో పాల్గొనేందుకు తన భార్యతో కలిసి అత్తగారి ఊరైన చింతలమానెపల్లి మండలంలోని రుద్రపూర్‌కు బయలుదేరాడు. చింతలమానేపల్లి మండలం కర్జేవేలి గ్రామానికి చెందిన చౌదరి రవి తన పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై సలుగుపల్లి వైపు వస్తుండగా ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో మధునయ్య అక్కడికక్కడే మృతి చెందగా రవి, అతని భార్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలలకూ హక్కులున్నాయ్

- నేడు బాలల దినోత్సవం


చిన్నయ్య, సంక్షేమ శాఖ అధికారి

మంచిర్యాలటౌన్: బాల్యం పిల్లల హక్కు. అమ్మ ప్రేమ.. నాన్న కరుణ.. ఆటపాటలతో చిరునవ్వులు చిందిస్తూ.. ఆనందంతో వెల్లివెరిసే వయస్సులో పలువురు బాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, అత్యాశ, చులకన భావం వంటివి బాలలపై మోయలేని భారం మోపుతున్నాయి. ఈ నేపథ్యంలో బాలల హక్కులకు మరింత పటిష్టత కల్పిస్తూ ప్రభుత్వం బాలల న్యాయచట్టం-2015 అమల్లోకి తెచ్చింది. నేడు బాలల దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల గు రించి జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య వివరించారు.

న్యాయ చట్టం 2015

బాలలపై జరిగే నేరాలు, బాలలు చేసే నేరాల విషయాల్లో సంబంధిత వ్యవస్థలు ఏవిధంగా వ్యవహరించాలో న్యాయ చట్టం 2015లో నిర్దిష్టంగా పొందుపరిచారు. నేరాలు చేసిన బాలల కోసం, బాలల రక్షణ, సంరక్షణ కోసం, అవసరంలో ఉన్న బాలల పునరావాసం కోసం అనుసరించాల్సిన పద్ధతులను ఈ చట్టంలో పొందుపరిచారు. దివ్యాంగులైన బాలలపై నేరాలకు పాల్పడితే చట్టంలో ఉన్న శిక్షలకు రెండింతల శిక్షలు విధిస్తారు.

విద్యాహక్కు చట్టం

కేంద్ర ప్రభుత్వం 2009 ఆగస్టు 9న నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలులోకి తెచ్చింది. 2010 ఏప్రిల్ 1నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది.

జీవించే హక్కు

ఇది ఆరోగ్య ప్రమాణానికి సరైన జీవన స్థితికి గల హక్కు. దీని ప్రకారం పిల్లలు, అనారోగ్యం, ఇతర ప్రమాదాల వలన మరణించకుండా ఆరోగ్యంగా జీవించే హక్కును సంపాదించుకున్నారు.

రక్షణ హక్కు

- భారత రాజ్యాంగ చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలచేత ఫ్యాక్టరీలు, గనులలో పనులు చేయించడం నేరం
- బడికి వెళ్లని 5 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్యను అందించే హక్కు.
- పిల్లల ఆలంబన, వికాసం, సంరక్షణ, సాంఘిక భద్రత హక్కులతో పాటు విశ్రాంతికి, వినోదానికి, సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన హక్కులు ఉన్నాయి.
- తల్లిదండ్రులతో కలిసి జీవించలేనట్లయితే ప్రత్యేకమైన సంరక్షణ, సహాయం పొందే హక్కు బాలలకు ఉంది.

సహాయం కోసం 1098 టోల్‌ఫ్రీ

బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు చైల్డ్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించారు. తప్పిపోయిన బాలలు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, ఒంటరిగా ఉన్న బాలలు, వీధిబాలలు, ఇంటి నుంచి పారిపోయిన బాలలు, లైంగిక వేధింపులు, అవమానాలకు గురైన బాలలు, హెచ్ఐవీకి గురైన బాలలు, హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితుల పిల్లలు, ప్రకృతి వైపరీత్యం, మానవ తప్పిదం వల్ల నష్టపోయిన బాలలు, అంగవైకల్యంతో ఉన్న బాలలు, భిక్షాటన చేస్తున్న బాలలు, అనాథలు, నిరాదరణకు గురైన బాలలు, దీర్ఘకాలిక/ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న బాలలు, సెక్స్ వర్కర్ల పిల్లలు, అక్రమ రవాణాకు గురైన బాలలు సహాయం కొరకు 1098కు ఫోన్ చేయవచ్చు.

చప్రాలలో ఉద్రిక్తత


కాంగ్రెస్ శ్రేణులను నిలువరించిన సీఐ నరేశ్‌కుమార్

- ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బాహాబాహీ
- రంగప్రవేశం చేసిన పోలీసులు

బేల: మండలంలోని చప్రాల గ్రామంలో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా దూషించడంతో మనోహర్ అనుచరులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు బాహాబాహీకి దిగారు. ఎస్సై రాధిక, పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్‌ఎస్ శ్రేణులను సముదాయించారు. మరోవైపు జైనథ్ సర్కిల్ సీఐ కోల నరేశ్‌కుమార్ కాంగ్రెస్ శ్రేణులను నిలువరించారు. చాలాసేపటి తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. పార్టీల నాయకులు పరస్పరం బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

గోలేటి టౌన్‌షిప్‌లో చోరీ


బీరువా పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి గోలేటి టౌన్‌షిప్‌లో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన వడ్డెపల్లి శ్రీపతి తన భార్యతో కలిసి ఆదివారం ఇంటికి తాళం వేసి జమ్మికుంటకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు శ్రీపతికి సమాచారం అందించారు. హుటాహుటిన ఇంటికి తిరిగివచ్చిన శ్రీపతి లోనికి వెళ్లిచూడగా ఇంట్లో ఉన్న రెండు బీరువాలు పగులగొట్టి ఉన్నాయి. అందులో ఉన్న 3.5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వాటి విలువ సుమారు రూ.90 వేల వరకు ఉంటుందన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో విక్రయించిన భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆసిఫాబాద్‌కు చెందిన ఏమకుల రవీందర్ 2010లో తిలక్‌నగర్‌కు చెందిన నలిమెల మొండయ్య వద్ద భూమిని కొనుగోలు చేశాడు. ఈ నెల 12న మొండయ్య తన తన అనుచరులతో కలిసి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు కాంపెల్లి విద్యాసాగర్(32) మృతి చెందాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం..విద్యాసాగర్ బైక్‌పై వేగంగా ఇచ్చోడ నుంచి సొనాలకు వస్తుండగా బజార్‌హత్నూర్ శివాజీచౌక్ వద్ద ఆటోను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వరుని ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించారు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి గుడ్డ కట్టుకుని ఆలయ తాళం పగలగొట్టి చొరబడ్డాడు. అమ్మవారి గుడి తాళం పగులగొట్టేందుకు చేసిన ప్రయత్నం విఫలమై తిరిగి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో డాగ్‌స్క్వాడ్‌లు రప్పించి తనిఖీ నిర్వహించారు. సర్పంచ్ విఠల్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

పండగపూట విషాదం

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- పెంబిలో ఘటన


ఈర్ల రంజిత్ మృతదేహం

పెంబి: దీపావళి రోజున విషాదం నెలకొంది. మొక్కజొన్న పంటకు నీళ్లు పట్టేందుకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పెంబి మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మండల కేంద్రానికి చెందిన ఈర్ల పోసాని-నర్సయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈర్ల రంజిత్ (23) దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండునెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి నిశ్చయమైంది. త్వరలో పెళ్లి జరగాల్సి ఉంది. గ్రామ సమీపంలో తన తండ్రికి ఉన్న మొక్కజొన్న పంటకు నీళ్లు పట్టేందుకు ఆదివారం ఉదయం 6 గంటలకు వెళ్లాడు. ఉదయం 10 గంటల అవుతున్నా ఇంటికి రాలేదు. తండ్రి అక్కడికి వెళ్లి చూడగా.. విద్యుత్ మోటర్ వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. పెళ్లిపీటలు ఎక్కాల్సిన కొడుకు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి వ్యక్తి మృతి

భైంసారూరల్: ఆటోలో నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన భోజారాం(55) సోమవారం భైంసాకు వచ్చాడు. పనులు చేసుకుని తిరుగుప్రయాణంలో ఆటో ఎక్కాడు. మిర్జాపూర్ సమీపంలోకి చేరుకోగానే ఆటోలో నుంచి జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆసుపత్రికి తరలివచ్చారు.

అనుమానాస్పదంగా వ్యక్తి ..

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన జంకోల్ల గంగాధర్ అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగాధర్ (50) ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శివారు ప్రాంతంలోని వ్యవసాయ బావిలో ఆదివారం శవమై కనిపించాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అక్కడి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గంగాధర్ కుమారుడు అనిల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించినవారిపై కేసు

నర్సాపూర్(జి): తమ విధులకు ఆటంకం కలిగించారని హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదుతో బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. గొల్లమాడలో ముధోల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి ఆదివారం ప్రచారం చేస్తుండగా బీజేపీ ప్రచార వాహనాన్ని ఆ పార్టీ నాయకులు రోడ్డుకు అడ్డంగా పెట్టారు. హెడ్ కానిస్టేబుల్ సాయన్న, కానిస్టేబుల్ రమేశ్‌లు వాహనాన్ని తొలగించాలని చెప్పిన వినకుండా వారి విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.